# ఎందుకు కౌమోడుము?

ఆర్. వసుంధరా దేవి



ధర్మారావుకి వయను ముప్పై దాటి ఉంటుంది. మంచి ఒడ్డూ పొడుగూ, వసిమి ఛాయ కలిగి పొడుగ్గా పెంచిన ఉంగరాల జుట్టూ, ఖరీదైన బట్టల్లో ఆకర్షణీయంగా కనిపిస్తాడు. అతనికి ఆధునికత మీద చాలా మోజు. చురుకుదనమూ, నిశితమైన ఆలోచనా పటిమా కలిగినవాడు. ఆధునిక జీవనసరళికి నూతన భాష్యాన్ని చెప్పి, జవసత్వాలను సమకూర్చుతున్న మేధావి వర్గానికి చెందినవాడు. మంది మనస్తత్వాన్ని చక్కగా ఎరిగి నడుచుకునే లౌక్యుడు కూడా. కాకినాడలో పుట్టి పెరగడమే కాక, ఏడేళ్లనుండి అక్కడి కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. కాలేజి స్టాఫ్ క్లబ్‌కు సెక్రటరీగా ఉన్నాడు. కార్తీక మాసంలో వనభోజనాలు ఏర్పాటు చేసినా, పిక్నిక్ ప్రోగ్రాం వేసినా, కాలేజీలో ఏ ఫంక్షన్ జరిగినా ధర్మారావు

చురుగ్గా పాల్గొంటాడు. కాఫీ, సిగరెట్, పేకాట, లోకాభి రామాయణం వంటి ఆధునిక కాలక్షేప ప్రక్రియలన్నీ అతనికి చాలా ప్రియమైనవి - భార్య శారదా సోమిదేవి తర్వాత. సోమిదేవి బి.ఎ. పాసైంది. చాలా అందంగా ఉంటుంది. పెళ్లి నిశ్చయమయ్యాక ఆమె పేరు బాగలేదని పేచీ పెట్టి ఆ పేరుకు 'శారద'ను జతచేయించింది ధర్మారావే! ధర్మారావుకు తన పేరంటే కూడా నామోషీనే. అది తనకు తగినట్లుగా లేదని చాలా కించపడుతూ ఉంటాడు లోలోన. ఆస్వాల్డ్ వచ్చి ఆ పేరుకు అర్థం అడిగినప్పుడు, అతనికి చెప్తూ మొదటిసారిగా ఆ పాతకాలపు మాటలోని గొప్ప అర్థాన్ని గుర్తించుకుని సంతోషించాడు!

ఆంత్రోపాలజీలో పరిశోధన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి ఏడాది నుంచీ పట్టణాలన్నీ చుట్టబెడుతున్నాడు ఆస్వాల్డ్. ఆరడుగుల ఎత్తూ, ఎండ వేడిమికి కమిలిన తెలుపురంగూ, నీలి కళ్లూ, పీచు జుట్టూ గల పాతికేళ్ల జర్మన్ అమెరికన్ యువకుడు అతను. ఎదుటివారు చెప్పే విషయాన్ని శ్రద్ధగా వినడం, తాను మాట్లాడబోయే ముందు ప్రతిసారీ 'హిహిహి' అని నవ్వడం అతనికి అలవాటు. ఆ నవ్వు సందర్భాన్నిబట్టి ఒక్కోసారి ప్రత్యేకార్థం లేని అలవాటుగానూ, ఒక్కోసారి కేవలం మొహమాటంలాగానూ, మరోసారి వెక్కిరింతలాగానూ అర్థం అవుతూ ఉంటుంది ఎదుటివారికి.

స్వల్ప పరిచయంతోనే ఆస్వాల్డ్‌కు అతుక్కుపోయాడు ధర్మారావు. తన ఇంట ఆతిథ్యం ఇచ్చాడు. కోనసీమ తెలుగుదనాన్ని రుచి చూపించాడు. పీట మీద ఆసీనుడై అరిటాకులో భోజనం చెయ్యడం, ఆవకాయా, గడ్డపెరుగూ, పులిహోరా, గోంగూరా, బొబ్బట్లూ - అన్నిటికీ ముచ్చటపడ్డాడు ఆస్వాల్డ్. శారదా సోమిదేవి అందాన్ని చీరల్నీ పిల్లల్నీ చాలా మెచ్చుకున్నాడు. అతని ఎడల ఆత్మీయతా భావం కలిగింది ధర్మారావుకు. ప్రతి విషయానికీ అర్థం అడిగే అలవాటుంది ఆస్వాల్డుకు.

ఈ స్నేహ బాంధవ్యంలో ధర్మారావు ఆధునికత పొరలన్నీ కరిగిపోయి అతని అంతరాంతరాల్లో గుప్తంగా దాక్కుని ఉన్న స్వాభిమానం పొంగి వచ్చింది. అనాదియైన తన సంస్కృతినీ, వారసత్వాన్నీ తలచుకున్నాడు. ఇతరులతో గర్వంగా చెప్పుకోలేని విషయాలు చెప్పుకున్నాడు. తన ముత్తాత తమ ఊళ్లో శివాలయం కట్టించారు. తాతగారు యజ్ఞం చేసి సోమయాజి అయ్యారు. తండ్రిగారు సంస్కృతంలో ఉద్దండ పండితులు. సంపద, వస్తువులు వస్తాయి, పోతాయి - మనిషి ఉన్నతికి అవి ముఖ్యం కాదు, సంస్కృతి ఒక్కటే నిజమైన సంపద. ఆధ్యాత్మికత నిజమైన వారసత్వం. ఈ దేశం ప్రపంచానికే ఆధ్యాత్మిక కేంద్రం. సనాతన ధర్మం ఇక్కడే ఊపిరి పీల్చుకున్నది. ఈ సనాతన ధర్మం అనే అద్దం మీద దుమ్ము పేరుకుంటుంది. కాని ఎప్పటికప్పుడు దానిని తుడిచివేయడం జరుగుతూనే ఉన్నది. ఇదివరలో ఎందరో మహాపురుషులు ఆ ఛాందసపు దుమ్మును తుడిచారు. ఇప్పుడు ఈ దేశంలోని యువతలో నవచైతన్యం వచ్చింది. విప్లవతత్వం, శాస్త్రీయ దృక్పథం ఏర్పడినవి. కొత్తదనాన్ని ఆహ్వానిస్తున్నారు. నవశకానికి పునాది వేస్తున్నారు. "మా దేశానికి గత వైభవం తప్పకుండా తిరిగి వస్తుంది!" అంటున్న ధర్మారావు గొంతులో నమ్మకం ధ్వనించింది.

"హి హి హి! మీ వలననా?" అన్నాడు ఆస్వాల్డ్.

"ఎందుకు కాకూడదు?" తిరుగు ప్రశ్న సేశాడు ధర్మారావు చురుగ్గా.

తన దేశానికి తిరిగి వెళ్లే ముందుగా ప్రపంచ ప్రసిద్ధమైన తిరుపతి దేవాలయాన్ని చూడాలన్న తన గాఢమైన కోరికను వెలిబుచ్చాడు ఆస్వాల్డ్. అన్య మతస్థుల్ని దేవాలయంలోనికి రానివ్వరేమో నన్న సందేహం తలెత్తింది. తన ఆధునిక భావాలకు ఇదొక సవాలుగా భావించాడు ధర్మారావు. ఉత్సాహంగా ఆ బాధ్యత పుచ్చుకున్నాడు. తోటి లెక్చరర్ సోమేశ్వర్‌ను కూడా బయల్దేరదీశాడు.

తిరుమల కొండ మీద కాటేజిలో ఆస్వాల్డ్ పీచు జుట్టుకు నల్లరంగు వేశారు. పట్టుపంచె కట్టి, లాల్చీ వేసి, నుదుట నామాలు దిద్దారు. చేతులు రెండూ జోడించి కింది నేలనే చూస్తూ నడవమన్నారు. సోమేశ్వర్, ఆస్వాల్డ్, ధర్మారావు ఒకరి వెనుక నొకరుగా క్యూలో చేరారు.

దేవుడి దర్శనం అయిపోయి దేవాలయంలో నుంచి బయటకు వచ్చి చూసుకుంటే ధర్మారావు జేబులో పర్సు లేదు. అందులో ఆరువందల దాకా డబ్బు ఉండాలి. ధర్మారావు చాలా హడావుడి పడిపోయాడు. కంగారుగా చుట్టూ వెతికాడు. పర్సు కనపడిందా? అని అక్కడున్నవాళ్లను అడిగి చూశాడు. అదెక్కడ పడిపోయిందో, ఎవరు తీశారో! అది దొరకదని నిశ్చయించుకున్నాక అక్కడి జనాన్ని చీదరగా చూశాడు. నిస్సహాయంగా ఏమీ చేయలేక మండిపడిపోయాడు. పోలీసు రిపోర్టు ఇస్తే డబ్బు దొరకదు గాని చికాకులు చుట్టుకుంటాయి. దొంగలూ, పోలీసులూ లాలూచీ అయిపోవడం మామూలైపోయింది. దేశానికీ, దైవానికీ కూడా ఎంతటి దుర్గతి పట్టింది! దైవ

## భలే మంచి చౌక బేరము!

దేశము సమ్మబూనితి మిదే దొరలార! కొనంగ రండు! మా
ఆశయ మెల్ల దీని తెగనమ్ముట ఏ వెలకైన, కాన, ఏ
దేశమునైన మే మనుతింతుము, వేలమునందు పాల్గొనన్
లేశము సంశయింప పనిలేదు నిజ మ్మిది విశ్వసించుడీ!

జాతీయ మను మాట జన్మలో నికపైన,
వలుకంగబోము స్వప్నమునైన!
దేశీయ మనెడి యుద్దేశ్యమ్ము నికపైన
తలపంగబోము నవ్వులకునైన!
స్వావలంబనమను భావమ్ము నికపైన
మననీయబోము మచ్చునకునైన!
ఆత్మ గౌరవమను అర్థమ్ము నికపైన
మనమున నిలుపము మందుకైన!

జాతి నీతి యటంచు దేశమ్మటంచు
ఎపుడొ మా పెద్దవా రొనరించినట్టి
తప్పులను నెమ్మనమ్ముల దలచి తలచి
సిగ్గుతో క్రుంగి తలలు వాల్చితిమి నేడు!!

దేశము వీడిపొమ్మని విధేయత సుంతయు లేక, వెర్రి ఆ
వేశముతోడ నాడు ప్రలపించుట లెల్ల క్షమింపుడయ్యా! మా
ఆశల, ఆశయమ్ముల ఫలాభిముఖమ్ములుగా నొనర్చ మా
దేశము జేరుడయ్య! అనధీతుల మమ్ము సముద్ధరింపగన్!!

ఏ పరిశ్రమలైన స్థాపింపవచ్చు!
ఎట్టి యాంక్షలనైన విధింపవచ్చు!
మారుమాటాడబోము! కిమ్మనగబోము!
రండు దొరలార! జాగేల రండు రండు!

గడియారం శేషఫణి శర్మ

దర్శనం అంటూ వచ్చిన ఈ జనంలో దొంగ లెందరో, దొర లెందరో! ఛీ ఛీ! అని చీదరించుకున్నాడు. కోపం కొంచెం తగ్గాక, "నా వస్తువంటూ ఎప్పుడూ దొంగతనం జరగలేదు. ఇప్పు డీ పర్సు ఎందుకు పోయినట్లు?" అన్నాడు సోమేశ్వర్‌తో చిన్నగా.

ఇదంతా ఆసక్తిగా గమనిస్తున్నాడు ఆస్వాల్డ్. అతని చురుకైన నీలి కళ్లు అలవోకగా పరిసరాలన్నిటి మీదా పరుగులు తీస్తున్నాయి. కాటేజీకి వచ్చి స్థిమితంగా కూర్చుని, "హి హి హి! గొప్ప దేవుడు! గొప్ప భక్తి! గొప్ప దొంగతనాలు! అన్నీ ఒకచోటే!" అన్నాడు.

ఆ మాటలు వెక్కిరింతలాగా ధ్వనించాయి. మహా ప్రసిద్ధమైన ఇంతటి దేవాలయాన్ని చూశాక అనవలసిన మాటలు కాదు! ఆస్వాల్డ్ విచిత్ర వేషధారిలాగా, అసహజంగా కనిపించాడు. సంపన్నమైనదే కావచ్చు గాని, ఒక సామాన్య దేశం ప్రాచీనమూ, సనాతనమూ అయిన ఒక మహత్తర సంస్కృతిని వేలెత్తి చూపుతున్నది!

"అవునండీ! అన్ని రకాల ప్రవృత్తులూ మనిషిలో ఉండేవే! అన్నిటినీ సహజంగా ఒప్పుకునే ఔదార్యం మాకున్నది! చిన్న విషయాలతో మనసులు కలుషితం కారాదు!" అన్నాడు సోమేశ్వర్ విసురుగా.

ఆస్వాల్డ్ మళ్లీ నవ్వాడు. హాయిగా, పెద్దగా నవ్వాడు. "హి హి హి! ధర్మారావుగారికి అలాంటి ఔదార్యం లేదు! భలే కోపం తెచ్చుకున్నాడు దొంగ మీద!" అన్నాడు నవ్వుతూ.

అతని నవ్వులో వైపరీత్యం ఉంది. వ్యంగ్యం ఉంది. విషం ఉంది.

కొండ దిగిరాగానే ఆస్వాల్డ్ సెలవు తీసుకున్నాడు. "మీ ఆతిథ్యాన్నెప్పుడూ గుర్తుంచుకుంటాను! మా దేశం వెళ్లగానే లెటర్ రాస్తాను" అన్నాడు అభిమానంగా.

అత నటు వెళ్లగానే, "అంతా అబద్ధం! వాడి రకం చూశాం కదా! ఎక్కడికక్కడ తిని పని గడుపుకుపోయే రకం! వా డేం లెటర్ రాస్తాడు!" అన్నాడు సోమేశ్వర్ ఖండితంగా. ఆస్వాల్డ్ అతనికి నచ్చలేదు.

వాళ్ల రైలు నెల్లూరు చేరుకుని ఆగిపోయింది. కోస్తా తీరాన్ని తాకిన గొప్ప తుపానులో చిక్కుకున్నారు. కాకినాడ చేరటానికి వారం రోజులు పైన పట్టింది.

ఆ మహాప్రళయం తాలూకు కన్నీళ్లు ఉప్పెనలోనూ, హాహాకారాలు తుపానులోనూ కలిసిపోగా జీవచ్ఛవాలుగా మిగిలిపోయిన దుఃఖితుల బాధామయ గాథలు గాలినిండా చిక్కగా పరుచుకుపోయి ఉన్నాయి. పేపర్లనిండా అవే కథలు. ఎవరినోట వచ్చినా అదే విషయం.

కాలేజికి వెళ్లేసరికి అక్కడి వాతావరణం చాలా వేడిగా ఉంది. కాలేజిలోని అధ్యాపకులూ, ఇతర ఉద్యోగులందరూ తమ నెల జీతంలో పదో శాతం తుపాను బాధితుల నిధికి ఇవ్వాలని ప్రిన్సిపాలు నోటీను పంపించారు. జీతాల్లో పది శాతం! ఎంత కోత!. మనసుల్లో ఎవరి కెంత నష్టమో లెక్కలు తేలిపోయాయి. చాలామంది లెక్చరర్లకు ఇది సమ్మతం కాలేదు. ఈ సమస్యను ఎదుర్కోవలసిన బాధ్యత స్టాఫ్ క్లబ్ సెక్రటరీగా ధర్మారావు మీద పడింది.

"లెక్చరర్లు ఇష్టపూర్వకంగా విరాళం ఇస్తే అది వారి ఇష్టం. కాని పది శాతం విధిగా ఇవ్వాలని అడగటానికి ప్రిన్సిపాలుకు హక్కు లేదు!" అన్నాడు ధర్మారావు.

లెక్చరర్లలో ఉత్సాహం పుట్టుకొచ్చింది. నెల జీతంలో పది శాతం అంటే మాటలా? ఏమి టీ బలాత్కారం? ఈ తుపాను వలన కొందరు లెక్చరర్లకు కూడా నష్టం జరిగింది. వారి మా టేమిటి? ఈ నిరంకుశత్వాన్ని ఎదిరించాల్సిందే నన్న దృఢ నిశ్చయం సర్వత్రా కనిపించింది.

ఈ ఉత్సాహ కోలాహలాన్ని చూస్తున్న ప్యూవరు వీర్రాజు మెల్లగా అన్నాడు - "మనిషి కష్ట పొచ్చినప్పుడు ఆదుకుంటే తప్పేంటి సార్!" అన్నాడు.

ధర్మారావుకి కోపం వచ్చింది. ప్రతివాడూ నీతులూ, న్యాయాలూ చెప్పగలవాడే! "వీర్రాజూ! నీపాటి బుర్ర మాకు లేకపోలేదు. నీ బీడీలకీ, టీలకూ మా దగ్గర పిక్కుతావు. ఆలోచనలు గొప్పగా చేస్తున్నావు! ఇందులో ఉన్న తిరకాసులు నీకు అర్థం కావు. ఇక్కడ ప్రశ్న వేరు. బలవంతంగా మా దగ్గర డబ్బు వసూలు చేయడానికి ప్రిన్సిపాలుకు హక్కుందా అన్న విషయం ముందు తేలాలి. ఇవాళ ఇందు కడిగితే, రేపు మరొకందు కడుగుతాడు. నిజంగా తుపాను బాధితుల మీది అభిమానంతోనే ప్రిన్సిపాలు ఈ పని చేస్తున్నాడా? అందరి డబ్బూ పోగుచేసి పెద్దమొత్తంగా అందజేసి పేపర్లో పేరు వేయించుకోవాలని చేస్తాడు! ఈ పోగుచేసిన డబ్బు నిజంగా తుపాను బాధితులకే ఉపయోగపడుతుందని నమ్మకం ఉంటే, పదో వంతు కాదు, మా జీతాలు మొత్తం ఇచ్చినా తప్పు లేదు. ఎవరికి తోచిన విధంగా వారు సహాయం చెయ్యకుండా ఉంటారా?" అన్నాడు.

వీర్రాజుకి ఈ తిరకాసులు అర్థం కాలేదు. చేతిలో ఉన్న పది రూపాయలు ఇచ్చి "తుపానుకి నా లెక్కన రాయండి" అన్నాడు.

"వీర్రాజు పది రూపాయలిచ్చి గొప్పవాడైపోయాడు!" అన్నాడు ధర్మారావు.

అక్కడున్నవారంతా గొల్లున నవ్వేశారు.

ఇంటికెళ్లాక ధర్మారావు ఈ ప్రకృతి వైపరీత్యం గురించి తెగని ఆలోచనలో పడ్డాడు. సముద్రంలో బడబాగ్ని పుట్టింది. పెను తుపాను ప్రళయం సృష్టించింది. ఈ తుపానుకు కారణాలు శాస్త్రజ్ఞులు చెప్పగలరు. కాని అదంతా తుపానుకు దారితీసిన భౌతికమైన కార్యాకారణ సంబంధాన్ని వివరించడమే! తుపానును పుట్టించగలదీ కాదు, దాన్ని అదుపులో పెట్టగలదీ కాదు! దాని మూలం ఎక్కడో ఉంది. మనకు అర్థం కావడంలేదు. దైవశక్తి ముందు మానవ శక్తి ఎంత అల్పమైనదో ఇలాంటప్పుడే బాగా అనుభవాని కొస్తుంది. కారణాలకు కారణమైన మహత్కారణం కనుక్కోవడం ఎవరితరం!

ధర్మారావు మనస్సు కాలంలో వెనక్కు పరుగెత్తుకెళ్లింది. వెతికింది. ఆనాడు - తుపాను పెనుప్రళయంగా ముంచుకురాబోయే ముందు - సరిగ్గా ఆ ముందురోజునే తాము తిరుమలేశుని దర్శించారు. ఆస్వాల్డును ధర్మవిరుద్ధంగా గుళ్లోకి తీసుకెళ్లారు. ఈ అనాచారానికీ, ఆ ప్రళయానికీ ఎక్కడో ఒకచోట ఏదో కొంచెమైనా సంబంధం లేనే లేదని తాను చెప్పగలడా? చెప్పలేడు! మనుమల్లో ప్రబలిపోయిన అనాచారాలకూ, ప్రకృతీ, భగవంతుడూ స్పందించరా?! తాను ఇటువంటి పని ఎందుకు చేసినట్లు? అతను అడిగినంత మాత్రాన పవిత్రమైన దేవాలయంలోకి ఏకంగా తీసుకెళ్లిపోవడమేనా?! ధర్మారావు మనసునిండా సందేహమే!

సందేహించడం మేధవృత్తి. ప్రతి విషయాన్ని సందేహించి, ప్రశ్నించి, తర్కించి ముందుకు పోతుంది శాస్త్రం. శాస్త్రీయతకు సందేహం పునాది. సందేహం లేని వాడు మూర్ఖుడు. పిడివాది. మానవజాతి భవిష్యత్తును బాగుపరిచే కిటుకు ఎక్కడుంది? అస్తిత్వవాదంలోనా? జిడ్డు కృష్ణమూర్తి 'నెట్‌వర్క్ ఆఫ్ థాట్'లోనా? ఆలోచిస్తూనే నిద్రపోయాడు.

మరునటి రోజున పోస్టులో ఒక లెటర్, ఒక పార్సెల్ వచ్చాయి ధర్మారావుకు. రెండూ ఆస్వాల్డ్ దగ్గరనుంచే. 'మన స్నేహానికి గుర్తుగా ఒక పార్సెల్‌లో ఆరు షర్టులు పంపిస్తున్నాను. మనం తిరుపతిలో దేవాలయానికి వెళ్లిన విషయం నాకు ఎప్పుడూ గుర్తుంటుంది' అని రాశాడు. చించి అవకతవకగా అతికించినట్లు చిందరవందరగా ఉంది పార్సెల్. ధర్మారావు ఉత్సాహంగా దాన్ని విప్పాడు. లోపల ఒక పాత చిరిగిన దుప్పటి, కొన్ని రాళ్లు ఉన్నాయి. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌వారి మాయాజాలం!

కసిగా ఆ పార్సెల్‌ను చెత్తబుట్టలోకి విసిరికొడుతూ - 'ఈ దేశానికి మోక్షం లేదు' అనుకున్నాడు ధర్మారావు. ●



## అసలు కారణం

సుప్రసిద్ధ దేశభక్తుడు, స్వాతంత్ర్య సమరయోధుడు సత్యమూర్తి ఇంగ్లీషు, తమిళ భాషలలో మహా వక్త. సత్యమూర్తి పెదవి విప్పితేనే బ్రిటీషువారు కంగారు పడిపోయేవారు. ఒక సందర్భంలో తమ గొప్పదనాన్ని ప్రదర్శించాలని ఒక ఇంగ్లీషు ప్రముఖుడు సత్యమూర్తితో - "బ్రిటిష సామ్రాజ్యం మీద రవి అస్తమించడని మీకు తెలుసా?" అని అడిగాడు.

దానికి - "అది నిజమే. అయితే అసలు కారణం ఏమిటో మీకు తెలుసా? ఆ భగవంతుడు కూడా మిమ్మల్ని చీకట్లో నమ్మలేడు!" అన్నారు వెంటనే సత్యమూర్తి.

అంతే! ఆ మహానుభావుడు ఆ పరిసరాలలోనుంచి మాయమైపోయాడు.

సేకరణ : తాజీ ప్రసాద్ [మద్రాసు]